నేలపట్టు అభయారణ్యానికి 'రూ.10 లక్షలు విరాళం

ప్రజాశక్తి - వరదయ్యపాలెం

ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీ ఫౌండేషన్ తన కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా నేలపట్టు పక్షుల అభయారణ్యం అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం ప్రకటించింది. అభయారణ్యంలో మౌలిక సదుపాయాల కల్పన, సుందరీకరణ పనులకు ఈ విరాళం తోడ్పడనుంది. సోమవారం సూళ్లూరుపేట డిఎఫ్‌ఒ హారిక, ఇతర అటవీ అధికారుల సమక్షంలో శ్రీసిటీ ఫౌండేషన్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి విరాళం చెక్కును తిరుపతి సర్కిల్ ఫారెస్ట్ కన్సర్వేటర్ సి.సెల్వంకు అందజేశారు.

అదే 'నిర్బంధ' ఘట్టం

డిప్యూటీ మేయర్ ఎన్నిక నేటికి వాయిదా

హైకోర్టు కీలక ఆదేశాలు



బెదిరించి కూటమిలోకి శేఖర్‌రెడ్డిని లాగేసిన వైనం

తమకు బలం ఉందంటున్న వైసిపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అప్పుడు వైసిపి, ఇప్పుడు టిడిపి.. అదే నిర్బంధాలు.. అవే బెదిరింపు ధోరణులు.. ప్రభుత్వాలు మారాయి అంతే. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో వైసిపి ఎలా బెదిరింపులు, దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడిందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా ప్రతిపక్ష వైసిపి కార్పొరేటర్లపై అలానే వ్యవహరించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నికలు సోమవారం ఎస్‌వి సెనెట్ హాల్లో జరగాల్సి ఉండగా, 'కోరం' లేక ఎన్నిక వాయిదా పడింది. వైసిపి కార్పొరేటర్లు ఎన్నికల హాలుకు రాకుండా కూటమి నాయకులు దౌర్జన్యాలకు దిగారు. బెదిరింపులకు పాల్పడ్డారు. మొత్తం 50 మంది గాను 22 మంది కార్పొరేటర్లే వచ్చారు. మరో ముగ్గురు ఉంటే ఎన్నికలు జరిపేవారు. తగినంత 'కోరం' లేకపోవడంతో ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి, జేసీ శుభం బన్సల్ వెల్లడించారు. తిరిగి ఎన్నిక మంగళవారం జరుగుతుందని ప్రకటించారు.

వారం రోజులుగా తిరుపతి కార్పొరేషన్‌లో డిప్యూటీ మేయర్ ఎన్నికల నిర్బంధ ఘట్టాలు రసవత్తరంగా సాగాయి. కూటమి నేతలకు బలం లేకపోవడంతో వైసిపిలో ఉన్న పలువురు కార్పొరేటర్లను దారికి తెచ్చుకునేందుకు వారి ఆస్తులకు నష్టం జరిగేలా వ్యవహరించారు. ఐదు రోజుల క్రితం వైసిపి డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా బరిలో దిగిన శేఖర్‌రెడ్డి ఆస్తులను కూలగొట్టే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన వైసిపికి రాజీనామా చేసి కూటమి కండువా కప్పుకున్నారు. వైసిపి మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు ఎన్‌కె బాబు కూడా కూటమి పార్టీకి మద్దతు ప్రకటించారు. కొంతమంది ఆదివారం రాత్రి కొంతమంది చిత్తూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ హోటల్లో ఉన్న వారిని గుర్తించి తిరుపతి ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు తనయుడు ఆరణి మదన్, టిడిపి నేత పులిగోరు మురళీకృష్ణారెడ్డి, జెబి శ్రీనివాస్, నరసింహాయాదవ్ తమ్ముళ్లు కృష్ణయాదవ్‌లు హోటల్లో ఉన్న వైసిపి కార్పొరేటర్లను భయభ్రాంతులకు గురిచేశారు. సోమవారం ఉదయం రెండో డివిజన్ కార్పొరేటర్ ఉమకు సంబంధించి టీ షాపు హోటల్ కూల్చేందుకు జేసీబీలు తీసుకురావడంతో తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి అడ్డుకుని ధర్నా నిర్వహించారు. కూటమి పార్టీ [illegible] వైసిపి కార్పొరేటర్ల ఇళ్లకు వెళ్లి మరీ బెదిరింపులకు గురిచేశారు.

పోలీసులకు హైకోర్టు ఆదేశం

ప్రజాశక్తి-అమరావతి

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక నిష్పక్షికంగా, ప్రశాంతంగా జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలు జరిగే ఎస్‌వి యూనివర్సిటీ, సెనేట్ హాలు బయట కూడా సిసి కెమెరాలు పెట్టాలంది. పోలీస్ ఎస్కార్ట్ ఇవ్వాలని ఎస్‌పికి వైసిపి కార్పొరేటర్లు వినతిపత్రం ఇవ్వాలంది. బస్సుల్లో వెళ్లే వైసిపి కార్పొరేటర్ల ఆధార్ కార్డులను, బస్ నెంబర్లను ఆ పార్టీ ఎస్‌పికి ఇవ్వాలంది. ఆ తర్వాత వైసిపి కార్పొరేటర్లకు ఎస్‌వి యూనివర్సిటీ, సెనేట్ హాలు వద్ద వరకు పోలీసు ఎస్కార్ట్ ఇవ్వాలని ఎస్‌పికి జస్టిస్ సుజాత సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ పార్టీ కార్పొరేటర్లు ఓట్లు వేసేందుకు వెళితే దాడులు జరిగే అవకాశం ఉందంటూ వైసిపి ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసే భాస్కర్‌రెడ్డి వేసిన లంచ్‌మోషన్ పిటిషన్లపై విచారణ జరిపిన హైకోర్టు పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.

కోరం లేక ఎన్నిక వాయిదా

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ ఎన్నికలు ఉదయం 11 గంటలకు సెనెట్ హాలులో మొదలయ్యింది. 27 మంది వైసిపి కార్పొరేటర్లు కలిసి బస్సులు వస్తుండగా ఎస్వీ యూనివర్సిటీ రోడ్డులో కూటమి పార్టీకి చెందిన కొంతమంది బస్సును అడ్డగించి గాలి తీసేశారు. కొంతమంది కార్పొరేటర్లను తీసుకుని వెళ్లిపోయారు. కిడ్నాప్‌కు గురైన వారిలో అజయ్, మోహన్‌యాదవ్, అనీష్‌రాయల్, మరో ఇద్దరు ఉన్నారు. నిరసనగా వైసిపి ఎంపి డాక్టర్ గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం, మేయర్ డాక్టర్ శిరీష సహా పలువురు వైసిపి కార్పొరేటర్లు ఎస్వీ యూనివర్సిటీ సెనెట్ హాలు గేటు వద్ద ధర్నా చేయడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. కొంతమంది వైసిపి కార్పొరేటర్లు ఎండలో సొమ్మసిల్లి పడిపోయారు. మరికొంతమందికి షుగర్ లెవల్స్ డౌన్ కావడంతో ఇద్దరు ఇళ్లకు వెళ్లిపోయారు. దీంతో సెనెట్‌హాల్లో 22 మంది కార్పొరేటర్లు మాత్రమే మిగిలారు. ఎన్నికలు జరగాలంటే 47 డివిజన్లలో ఎంఎల్‌ఎ, ఎంపి, ఎంఎల్‌సికి ఓటు హక్కు ఉంటుంది. మొత్తం 50 మందికి గాను22 మంది కార్పొరేటర్లు మాత్రమే మిగలడంతో 'కోరం' లేదని ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు.

గెలుపు మాదే : ఎంఎల్‌ఎ

[illegible] డిప్యూటీ మేయర్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా గెలుపు తమదేనని ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు వెల్లడించారు. కూటమి ప్రభుత్వం ఎక్కడా వైసిపి కార్పొరేటర్లను బెదిరించలేదని, దౌర్జన్యాలు చేయలేదని, తాము శాంతియుతంగా ఎన్నికలు కోరుకుంటున్నామని, వైసిపి వారే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నిక ఎప్పుడు జరిగినా కూటమిదే గెలుపమని ధీమా వ్యక్తం చేశారు.

మళ్లీ క్యాంపుకు తరలిన కార్పొరేటర్లు

ఎన్నిక సోమవారం వాయిదా పడడంతో కూటమికి మద్దతు ఇస్తున్న 22 మంది కార్పొరేటర్లు ప్రైవేట్ హోటల్‌కు బస్సుల్లో తరిలారు. అలాగే వైసిపి కార్పొరేటర్లూ రహస్య ప్రాంతానికి వెళ్లిపోయారు. బుధవారం జరిగే ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి పునరావృతం అయితే రాష్ట్ర ఎన్నికల అధికారి దృష్టికి సమస్యను తీసుకెళతారు.

కూటమికి బలం లేకే దౌర్జన్యాలు : ఎంపి గురుమూర్తి

కూటమి పార్టీకి కార్పొరేటర్ల బలం లేకపోవడం వల్లనే వైసిపి కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి బలవంతంగా తీసుకెళ్లారు. 27 మంది వైసిపి కార్పొరేటర్లతో బస్సులో వస్తుంటే బస్సు గాలి తీసేసి, అద్దాలు ధ్వంసం చేసి, ఐదుగురు కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి ఎత్తుకెళ్లిపోయారు. మరికొంతమందిని ఓటింగ్‌కు రానీకుండా చేశారు. కూటమి దౌర్జన్యకాండను నిరసిస్తూ అందువల్లనే మేం ఎన్నికలను బహిష్కరిస్తున్నాం.

'కూటమి'లోనూ అనైక్యత

కూటమి డిప్యూటీ మేయర్ అభ్యర్థి టిడిపి కావడంతో ఆ పార్టీల నేతల్లోనూ అనైక్యత నెలకొందని గుసగుస వినిపిస్తుంది. అధినేతలు సరిగ్గా హేండిల్ చేయలేదన్న విమర్శలూ లేకపోలేదు. ఎంఎల్‌ఎ ఆరణి శ్రీనివాసులు జనసేన కావడంతో టిడిపి అభ్యర్థికి పదవి దక్కేలా డబ్బులు సరిగ్గా ఖర్చు చేయడం లేదని సమాచారం.

కార్పొరేటర్లను కాపాడండి : భూమన కరుణాకర్‌రెడ్డి

కిడ్నాప్‌కు గురైన కార్పొరేటర్లను కాపాడాలని మాజీ ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి ఎస్‌పికి ఫిర్యాదు చేశారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం వైసిపి కార్పొరేటర్లను కిడ్నాప్ చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కిడ్నాప్ చేశారనే విషయమై కొన్ని వీడియో ఆధారాలను ఎస్పీకి అందజేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'కార్పొరేషన్' రాజకీయంతో విద్యార్థులకు ఇక్కట్లు

కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఎన్నిక క్యాంపస్‌లో ఏర్పాట్లు చేయడంతో యూనివర్సిటీ విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. విద్యార్థులు, సిబ్బంది లోనికి రావడానికి గుర్తింపు కార్డులు చూపించాల్సి వచ్చింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఓ విద్యాసంస్థలు డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగడం ఏంటని కొంతమంది విమర్శించారు. క్యాంపస్‌లో మొదటి, రెండు, ఐదో గేట్లను మూసేయడంత విద్యార్థిసంఘాల నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో కార్పొరేషన్ ఎన్నికలు జరుపుకునేందుకు ఎలా అనుమతి ఇస్తారని విద్యార్థిసంఘాల నాయకులు ప్రశ్నించారు.

మహాసభలకు తిరుపతి నగరం నుంచి హాజరైన కార్యకర్తలు

సిపిఎం రాష్ట్ర కమిటీ ఆహ్వానితులుగా వి.నాగరాజు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సిపిఎం రాష్ట్ర మహాసభలు స్ఫూర్తిదాయకంగా నెల్లూరు వేదికగా పుచ్చలపల్లి సుందరయ్య గడ్డపై సీతారాం ఏచూరి నగర్‌లో మూడు రోజుల పాటు జరిగాయి. సోమవారం భారీ ర్యాలీ, బహిరంగసభతో మహాసభలు ముగిసాయి. చివరిరోజు సిపిఎం రాష్ట్ర నూతన కమిటి ఏర్పాటయ్యింది. ఈ కమిటీలోకి ఆహ్వానితులుగా సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజును మరోసారి తీసుకున్నారు. సోమవారం జరిగిన బహిరంగసభ ఎర్రజెండా రెపరెపలతో పోరాటాల గడ్డ ఎరుపెక్కిందని వందవాసి నాగరాజు అన్నారు. రానున్న మూడేళ్లలో మరింత ఉత్తేజంగా క్షేత్రస్థాయి, రాష్ట్రస్థాయి పోరాటాలు చేయనున్నట్లు చెప్పారు. తిరుపతి జిల్లా నలుమూలల నుంచి వందలమంది కార్యకర్తలు, అభిమానులు ర్యాలీలో పాల్గొన్నారని 'ప్రజాశక్తి'కి తెలిపారు.

23న 'ప్రజారోగ్యం- సామాజిక బాధ్యత' సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఆంధ్రప్రదేశ్‌లో ప్రజారోగ్యం – సామాజిక బాధ్యత' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సును ఎస్‌వి మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఈనెల 23న ఆదివారం నిర్వహించనున్నట్లు వేదిక కన్వీనర్ కామేశ్వరరావు వెల్లడించారు. సోమవారం యశోదానగర్‌లోని విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఆరోగ్యాభిలాషుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజారోగ్యం ప్రమాదంలో పడిందని, దీనిని కాపాడుకోవాల్సిన బాధ్యత పౌరులందరిపై ఉందన్నారు. ఆరోగ్య రంగంలో అనేక సంస్కరణలు చేపట్టిన సీనియర్ ఐఎఎస్ అధికారులు డాక్టర్ సుజాతరావు, డాక్టర్ పివి రమేష్‌లు పాల్గొంటారని వివరించారు. ఈ సదవకాశాన్ని తిరుపతి నగరంలోని డాక్టర్లు, ఆరోగ్య సిబ్బంది, రుయా, మెటర్నిటీ, ఆయుర్వేదం, స్విమ్స్ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న సిబ్బందితో పాటు, నగరంలోని మెడికోలు, నర్సింగ్ విద్యార్థినులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మునస్వామి, రుయా సీనియర్ వైద్యురాలు రోజా రమణి, ఆయుర్వేద వైద్య నిపుణులు డాక్టర్ రవీంద్ర, డాక్టర్ శ్రావ్య, ఆక్యుపంక్చర్ వైద్య నిపుణులు డాక్టర్ బాలాజీ, సీనియర్ వైద్యులు డాక్టర్ జాలేశ్వర రావు, మధ్యతరగతి ఉద్యోగుల జిల్లా కన్వీనర్ కే ఎన్ ఎన్ ప్రసాదరావు, వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, కోశాధికారి కేఆర్ సుబ్రహ్మణ్యం, సిఐటియు నేతలు కందారపు మురళి, ఆర్. లక్ష్మి పాల్గొన్నారు.

నేడు సప్తవాహనాలపై శ్రీవారి విహారం

- సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
- ఏర్పాట్లను పరిశీలించిన టిటిడి ఈవో

ప్రజాశక్తి - తిరుమల

రథసప్తమి సందర్భంగా మంగళవారం సప్తవాహనాలపై శ్రీవారు భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ ఉత్సవాన్ని మినీ బ్రహ్మోత్సవంగా భక్తులు విశ్వసిస్తారు. తిరుమల శ్రీవారి ఆలయ మాడ వీధుల్లో చేసిన ఏర్పాట్లను సోమవారం సాయంత్రం టీటీడీ ఈవో జె.శ్యామలరావు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరితో కలిసి పరిశీలించారు. గ్యాలరీల్లో అన్న ప్రసాదం పంపిణీ, తాగునీరు, మరుగుదొడ్లు, షెడ్లు వంటి సౌకర్యాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పోలీసులు, విజిలెన్స్ సమన్వయంతో మాడ వీధుల్లో ప్రత్యేక నిఘా ఉంచాలని అన్నారు.

అనంతరం ఈవో మీడియాతో మాట్లాడుతూ మంగళవారం రథసప్తమి పర్వదినం సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు ఏడు వాహనాలపై స్వామివారు తిరుమాడ వీధుల్లో ఊరేగుతారని తెలిపారు. రథ సప్తమి సందర్భంగా రెండు నుండి మూడు లక్షల మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. వేసవి తాపం కలగకుండా షెడ్లు ఏర్పాటు చేశామని, మాడ వీధుల్లో ఉన్న భక్తులకు నిరంతరాయంగా అన్న ప్రసాదం పంపిణీ చేస్తామన్నారు. రాత్రి చంద్రప్రభ వాహన సేవ వరకు అన్న ప్రసాదాలు పంపిణీ నిరంతరంగా కొనసాగుతుందన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని, సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచనున్నట్లు తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రెండు రెట్లు అధిక భద్రత కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, ఇన్ ఛార్జ్ సీవీఎస్వో మణికంఠ, జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఎఫ్ఎ అండ్ సీఏఓ బాలాజీ, సీఈ సత్య నారాయణ అధికారులు పాల్గొన్నారు.

15 వరకూ 'స్వచ్ఛత పక్షోత్సవాలు'

తిరుపతి సిటీ : జాతీయ వాయుమండలీయ పరిశోధన ప్రయోగశాల ఆధ్వర్యంలో స్వచ్ఛత పక్వాడ 2025 పేరుతో 15 రోజులపాటు నిర్వహించే స్వచ్ఛత పక్షోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. గాదంకి వద్దనున్న ప్రభుత్వ అంతరిక్ష శాఖ ఎన్‌ఏఆర్‌ఎల్ లో జరిగిన కార్యక్రమానికి ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అమిత్ కుమార్ పాత్ర ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ఫిబ్రవరి 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఈ పక్షోత్సవాలు జరుగుతాయన్నారు. పారిశుధ్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణ సమస్యలను పరిష్కరించడమే స్వచ్ఛ భారత్ మిషన్ ఉద్దేశ్యమన్నారు. ఈ స్ఫూర్తితో సరైన పారిశుధ్యం, వ్యర్థ పదార్థాల నిర్వహణను నిర్వహించాలని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించారు. గాదంకిలో వాటర్ ట్యాంకులు శుభ్రం చేయడం, విద్యార్థులకు జ్యూట్‌బ్యాగుల పంపిణీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవి ప్రసాద్, శ్రీనివాస గుప్త, అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాస గుప్త, మల్లికా మాధురి, జి. హరి వెంకట కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

'టిడ్కో' అర్హులకు న్యాయం చేస్తాం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గత టిడిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో గృహాలు పొందిన ప్రతి లబ్ధిదారుకి న్యాయం చేస్తామని టిడ్కో గృహాల కార్పొరేషన్ చైర్మన్ వేములపాటి అజయ్ కుమార్ హామీ ఇచ్చారు. సోమవారం ఆయన రాజీవ్ నగర్లోని టిడ్కో ఇళ్లను పరిశీలించారు. టీడీపీ హయాంలో శ్రీకాళహస్తికి ఏడు వేల ఇళ్లను మంజూరు చేయగా మొదటి విడతలో 2619 ఇండ్లను నిర్మించినట్లు తెలిపారు. గోడలకు పార్టీ రంగులు వేయడం కోసం చేసిన వేల కోట్లు ఖర్చును మౌలిక వసతుల కోసం వాడి ఉంటే ఎంతో మంది బీదవారు ఈ ఇండ్లలో ఉండే వారని అన్నారు. బ్యాంకుల నుంచి మీపై ఒత్తిడి తెస్తే నయా పైసా కట్టొద్దని సూచించారు. టీడీపీ నేతలు విజయ్ కుమార్ నాయుడు పాల్గొన్నారు.

ఎస్‌టి కుటుంబాలకు కరెంట్ మీటర్లు ఇవ్వాలి

తిరుపతి సిటి : కొరమేనకుంట దేముడు కాలనీలో నివాసమున్న ఎరుకల, యానాది కుటుంబాలకు కరెంటు మీటర్లు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని సిపిఐ నగర కార్యదర్శి జల్లా విశ్వనాథ్ డిమాండ్ చేశారు. కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. దాదాపు 130 మంది జీవనం సాగిస్తున్నారని, అయితే వారికి కరెంట్ మీటర్లు, మౌలిక సదుపాయాలు లేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారన్నారు.

తండ్రీకొడుకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు

ప్రజాశక్తి - సత్యవేడు

మండలంలోని ఓబుల్‌రాజ కండ్రిగ గ్రామానికి చెందిన జగదీష్, భాస్కరయ్యలపై పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదయ్యింది. పోలీసుల కథనం మేరకు... అరుంధతివాడకు చెందిన లక్ష్మయ్య ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు జగదీష్, భాస్కరయ్యలు ఎరువులను తీసుకెళ్లడానికి లక్ష్మయ్య ఆటోను బాడుగ మాట్లాడుకున్నాడు. అయితే ఇంతలో ఆటోలో ఉన్న ప్రయాణికులను దగ్గరలోని గ్రామంలోని విడిచి పెట్టి వస్తానని వెళ్లిన లక్ష్మయ్య తిరిగి చిన్నపాండూరుకు వచ్చి చూడగా అప్పటికే ఎరువుల సంచులను జగదీష్, భాస్కరయ్యలు వేరే ఆటో ఎక్కించి వెళుతుండటాన్ని గమనించాడు. లక్ష్మయ్య వారిని ప్రశ్నించగా ఇరువురి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ నేపథ్యంలో జగదీష్, భాస్కరయ్యలు లక్ష్మయ్యను కులం పేరుతో దూషించడంతో ఇరు గ్రూపుల వారు సొంత గ్రామానికి వెళ్లి మరోసారి ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో లక్ష్మయ్యకు గాయాలయ్యాయి. ఎస్ఐ రామస్వామి జగదీష్, భాస్కరయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. లక్ష్మయ్యను ప్రభుత్వాసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించారు.

కొనసాగుతున్న సామాజిక పింఛన్ల తనిఖీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తిరుపతి జిల్లా పరిధిలో సామాజిక పింఛన్ల తనిఖీని అధికారులు కొనసాగిస్తున్నారు. వారంలో మొదటి మూడు రోజులు చేపట్టే ఈ సామాజిక పింఛన్ల తనిఖీ తిరుపతి జిల్లాలో ఏడు ప్రదేశాలలో 12 కౌంటర్లను ఏర్పాటు చేసి అధికారులు ప్రత్యేక వైద్య బందం తనిఖీలు నిర్వహించారు. తిరుపతి రూయా హాస్పిటల్ లో కంటి పరీక్ష, వినికిడి లోపం, మానసిక వైకల్యం, చంద్రగిరి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో, సత్యవేడు సిహెచ్సిలో, వెంకటగిరి సిహెచ్ సిలో, నాయుడుపేట సిహెచ్ సిలో ఆర్థో పరీక్షలు, శ్రీకాళహస్తి, గూడూరులో ఆర్థో, కంటి పరీక్షలను ఒక స్పెషలిస్ట్ డాక్టర్, డిజిటల్ అసిస్టెంట్, ఒక వెల్ఫేర్ అసిస్టెంట్ తో ఈ సామాజిక పింఛన్లు తనిఖీ జరిగింది. 12 కౌంటర్లలో ఒక్కో కౌంటర్ సిబ్బంది 50 మంది చొప్పున ఏడు ప్రదేశాలలో ఈ సామాజిక పింఛన్ తనిఖీని నిర్వహించారు.

ఆ జ్ఞాపకాలెంతో మధురాతి మధురం

36 ఏళ్ల తరువాత అ'పూర్వ'కలయిక..!

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'ఆరోజుల్లో' అంటూ 36 ఏళ్ల తరువాత నెమరువేసుకున్న జ్ఞాపకాలు ఆ అయ్యోర్లకు అపూర్వ కలయికగా మిగిలింది.. 2005కు ముందు మన రాష్ట్రంలో ఉపాధ్యాయ విద్యను అభ్యసించుటకు అవకాశాలు చాలా తక్కువగా ఉండేవి. ఈనేపథ్యంలో పొరుగు రాష్ట్రమైన కర్నాటకకు వెళ్లి మన ఉపాధ్యాయులు కళాశాలల్లో శిక్షణ పొంది, ఇక్కడ ఉపాధ్యాయులుగా స్థిరపడేవారు. ఈ నేపథ్యంలో కర్నాటక రాష్ట్రం ములభాగల్ రామప్రియ టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో 1998-1990లో రెండేళ్లకాలం శిక్షణ పొందిన విద్యార్థులు 36 ఏళ్ల తరువాత తిరుపతిలో కలుసుకున్నారు. వారిలో ఒకరైన భీమినేని మునికృష్ణనాయుడు తిరుపతి పట్నూలు వీధిలోని నగర పాలక ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. ఆయన నేతృత్వంలో తిరుపతి న్యూబాలాజీ కాలనీలోని మేక్‌మై బేబీ జీనియస్ స్కూలు ఫంక్షన్ హాలు వేదికగా 'గెట్ టుగెదర్' నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హాజరయ్యారు. ఆనాటి కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, అధ్యాపకులు చెంగారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్దాజ్, రాజశేఖర్, రమణారెడ్డి హాజరయ్యారు. నవసమాజ నిర్మాతలుగా విద్యార్థులను తీర్చిదిద్దే గురుతర బాధ్యత ఉపాధ్యాయులకే సొంతం అన్నారు. వారిలో ఇటీవల ఉద్యోగ విరమణ చేసిన 9 మందిని సత్కరించారు.

ఈ కార్యక్రమంలో నాటి విద్యార్థులు మంజునాథ్, బద్రీనాథ్, రత్నరాజమ్మ, అనురాధ, నాగరాణి ,గీత, ఉష ,జ్యోతిలక్ష్మి, త్రిపుర ఉష ,రమేష్ ,సాయి ,ప్రభాకర్, రిటైర్డ్ ఫారెస్ట్ ఆఫీసర్ వేణు తదితరులు పాల్గొన్నారు.

అపూర్వ కలయిక..

శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ పలమనేరులో డిసెంబర్ 15 నుండి 18వ తేదీ వరకు రెండు రోజులపాటు, అదేవిధంగా జనవరి 28 నుండి 30వ తేదీ వరకు మూడు రోజులు పాటు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో శ్రీ పద్మావతి మహిళా పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. ఇందులో రమ్య టేబుల్ టెన్నిస్‌లో ద్వితీయ స్థానంలో విజేతగా నిలిచి జాతీయ స్థాయికి ఎంపిక అయ్యారు. ఖోఖోలో రన్నర్‌గా, 200 మీటర్ల రన్నింగ్‌లో మూడవ స్థానంలో నిల్చారు. క్రీడాలలో ప్రతిభ కనబరిచిన రమ్యను టీటీడీ విద్యాశాఖ అధికారి విజయలక్ష్మి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అసుంత అభినందించారు.

ఎస్వీ బాలమందిరానికి రూ.50 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల ఎస్వీ సర్వశ్రేయాస్ ట్రస్టుకు (ఎస్వీ బాలమందిరం) రూ.50 లక్షల విరాళ చెక్కును టిటిడి అదనపు ఈవో వెంకయ్యచౌదరికి దాత మోహన అందించారు. అయితే ఈ విరాళం అరుదైనదిగా నిలిచిపోయింది. భారత్‌సహా పలు దేశాల్లో విపత్తు అధికారిగా సేవలు అందించిన ఓ మహిళ తన జీవితంలో ఆదా చేసిన ప్రతి పైసాను వెంకన్నకు కానుకగా సమర్పించారు. టిటిడి విద్యాసంస్థల్లో చదువుతున్న అనాథ, పేద పిల్లల సంక్షేమానికి ఈ విరాళాన్ని వినియోగించాలన్నారు. రేణిగుంటకు చెందిన సి.మోహన భారతదేశంతో పాటు కాసావో, అల్బేనియా, యెమెన్, సౌదీ అరేబియాలలో అభివద్ధి - విపత్తు నిర్వహణ రంగాలలో వివిధ హోదాల్లో పనిచేశారు.

నిబంధన 'గోవిందా'

తిరుమలలో ప్లాస్టిక్ నిషేధం ఉంది.. దాదాపు ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు వాడరాదన్నది నిబంధన ఎప్పటి నుంచో అమల్లో ఉంది. అయితే కొండపైకి ప్లాస్టిక్ బాటిళ్లు ఎలా వచ్చాయబ్బా... పెద్దఎత్తున డంప్ అవడం గమనార్హం.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

- గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

వసంతలక్ష్మిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం యోగ-సమకోణాసనంలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన వసంతలక్ష్మిని, వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, వారి సతీమణి సంధ్యారాణి, పెన్వర్ ప్రోడక్ట్ లిమిటెడ్ డైరెక్టర్ గంటా మధు కృష్ణ, గాయత్రిలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాలో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించడం అభినందనీయమని, ఈమెను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. యోగా ద్వారా అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్మెంట్ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి, టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి గుండాల లీలావతి, గుండాల భారతి, కోడిపర్తి కల్పన, దాసరి శైలజ, తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి - ఓజిలి: పంటలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తే అటు పర్యావరణానికి, ఇటు ఆరోగ్యానికి మంచిదని పకృతి వ్యవసాయం ఓజిలి మండల ఇన్చార్జి జైతూన్ బీ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణంలో పకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు, అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. రైతులు అధిక దిగుబడి కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడుతుండడంతో నేల కలుషితమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పకృతి వ్యవసాయం సిబ్బంది చెంచమ్మ, యామిని, ధనంజయులు, ఐసిఆర్పిలు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలి

ప్రజాశక్తి -కోట : రైతుల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు అన్నారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ గిట్టుబాటు ధరలేక నష్టపోతున్న రైతాంగాన్ని ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో డెల్టా ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమయ్యాయని, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర 19550 రూపాయలు ఉండగా, బిపిటి రకం ధాన్యం పుట్టి 16 వేలకు, కే ఎన్ ఎం 17వేల రూపాయలకు రైతుల అమ్ముకుంటున్నారన్నారు. రైతాంగం ఈ సీజన్లో వ్యవసాయ పెట్టుబడులు కొంత అధికంగానే వ్యయం చేయాల్సి వచ్చిందని తెలిపారు. కనీస మద్దతు ధరలు లభించకుండానే రైతులు పంట అమ్ముకోవడం ఆందోళనకరంగా ఉందన్నారు. కనీస మద్దతు ధర రైతుకు లభించేందుకుగాను ఆర్ బి కే ల ద్వారా పంట కొనుగోళ్లు జరిగేటట్టు చర్యలన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎన్నో పోరాటాలతో సాధించుకున్న చట్టాలను నేటి ప్రభుత్వాలు నీరుగారుస్తున్నాయని సిపిఐ జిల్లా కార్యదర్శి మురళి దుయ్యబట్టారు. సోమవారం ఉదయం బీఎన్ కండ్రిగ మండలం, కనమనంబేడు దళితవాడ పేదలు ఇంటి స్థలాలకోసం ఎమ్మార్వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ కనమనంబేడు గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 252.253.254లో భూమిని కబ్జాదారులు ఆక్రమించినా, అధికారులు చూసిచూడనట్టుగా వ్యవహరిస్తున్నారన్నారు. ఆ భూమికి వేసిన కంచెను దళితులు తొలగిస్తే అక్రమ కేసులు పెట్టారన్నారు. వారిపై కేసులు ఎత్తివేసి, ఒక్కొక్కరికి 3 సెంట్లు జాగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 10వ తేదీన ఇళ్ల స్థలాల కోసం జరిగే పోరాటంలో ఇండ్లు లేని పేదలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

నాగాలమ్మకు వెండి తొడుగులు బహూకరణ

వెండి కవచాన్ని బహూకరిస్తున్న దాతలు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): చంద్రగిరి, కొత్తపేట, జమండ్లవీధికి చెందిన మట్టిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులు రూ.1,05,000/- విలువగల పంచలోహ జోడు నాగుల కవచం నాగాలమ్మ అమ్మవారి ఆలయమునకు విరాళముగా అందించారు. ఈ కార్యక్రమంలో ఒంటి బలరాంరెడ్డి, ఎం.ధరణి రెడ్డి, భక్తులు, స్థానికులు పాల్గొన్నారు.

బి. ఫార్మసీ కోర్సులో స్పాట్ అడ్మిషన్స్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో బి.ఫార్మసీ కోర్సులో చేరదలచిన వారికి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు డిఓఎ డైరెక్టర్ ఆచార్య ఊకా రమేష్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో బి.ఫార్మసీ కోర్సులో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ జరగనున్నాయని ఫార్మసీ విభాగాధిపతి, ప్రొఫెసర్ ఎస్. జ్యోత్స్న రాణి తెలిపారు. ఈ ప్రవేశ ప్రక్రియ కొరకు ఈ.ఏ.పి - సెట్ - 2024 లో అర్హత సాధించి ఉన్న వారికి మొదటి ప్రాధాన్యత, కేవలం ఇంటర్మీడియట్ (ఎంపీసీ, బైపీసీ) చదివిన వారికి చివరి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఈ కోర్స్ చేరదలచిన విద్యార్థులు సంబంధిత ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో 5 వ తేదీ బుధవారం ఉదయం 10 గంటలకు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ నందు హాజరుకావాలని, ఈ అడ్మిషన్లలో ప్రవేశం పొందిన వారికి ఫీజు రియంబర్స్మెంట్ సౌకర్యము ఉండదని వారు తెలిపారు.

హమాలీల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు పట్టణం శ్రీ బాలాజీ లారీ లోడింగ్, అన్లోడింగ్ హమాలి వర్కర్స్ యూనియన్ సమావేశం అంబేద్కర్ భవన్‌లో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఏఐటియుసి జిల్లా సమితి సభ్యులు మహేష్ మాట్లాడుతూ హమాలి కార్మికులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలతో కుటుంబ పోషణ వారికి భారమవుతోందన్నారు. అనంతరం హమాలి వర్కర్స్ నూతన కమిటీ అధ్యక్షులుగా వెంకటరమణను, ప్రధాన కార్యదర్శిగా మునిరత్నంను, కోశాధికారిగా గంగాధరంను, గౌరవ అధ్యక్షులుగా మహేష్‌ను, ఉపాధ్యక్షులుగా కులవర్ధన్‌ను, సహాయ కార్యదర్శిగా సుధాకర్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

తుమ్మలగుంటలో నేడు రథసప్తమి వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట శ్రీ కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ రోజు ఉదయం 6గంటల నుంచి చిన్నశేష, గరుడ, హనుమంత, కల్పవృక్ష, సర్వ భూపాల, చంద్రప్రభ వాహనాలపై స్వామివారిని ఊరేగించనున్నారు. ఏర్పాట్లను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పర్యవేక్షించారు. ఆలయాన్ని, వాహనాలను పుష్పాలతో సుందరంగా అలంకరించారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు

వీక్ష ది స్కూల్‌లో ఘనంగా సామూహిక అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - క్యాంపస్ : స్థానిక బైరాగిపట్టెడలోని వీక్ష ది స్కూల్‌లో వసంత పంచమిని పురస్కరించుకొని అక్షరాభ్యాస కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వసంత పంచమి నాడు మూడు సంవత్సరములు దాటిన పిల్లలకు అక్షరాభ్యాసం చేయించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ విమల రెడ్డి, అపుస్మా లీడర్లు, డిజి రఘు నారాయణరావు, అన్నమయ్య డిస్ట్రిక్ట్ బిసి జనరల్ సెక్రటరి అనగాని రెడ్డెప్ప, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చంద్రగిరి బ్లూమింగ్ బడ్స్ చిన్నారులకు అక్షరాభ్యాసం

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్ర గిరి:) చంద్రగిరి బ్లూమింగ్ బడ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమ వారం అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ హితేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలోచిన్నపిల్లలకు అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. పిల్లలకు పలక, బలపం, పుస్తకం, పెన్సిల్ మొదలైనవి బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వేణుగోపాల్, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

గూడూరు శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో..

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రెండవ పట్టణ పరిధిలో ఉన్న శ్రీ స్వర్ణాంధ్ర భారతి ఇంగ్లీష్ మీడియం పాఠశాల కరస్పాండెంట్ నవకోటి నాయుడు ఆధ్వర్యంలో వసంత పంచమి సందర్భంగా అక్షరాభ్యాస కార్యక్రమం జరిగింది. పిల్లలకు విద్యా సామాగ్రి బహుకరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ సునీల్ రాజ్, అకాడమిక్ కో- ఆర్డినేటర్ హరికృష్ణ, ప్రైమరీ ఇన్-చార్జ్ సింధు, పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులు, వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ మండలం కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో..

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ : సోమవారం వసంత పంచమిని పురస్కరించుకుని మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు సరస్వతీ దేవి విగ్రహానికి పూజలు చేశారు. ప్రధానోపాధ్యాయులు రూపేష్ కుమార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థులకు దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు యువశ్రీ మురళి, సురేష్ బాబు, నాదెండ్ల మురళి, దాసు, లక్ష్మయ్య, దేవేంద్ర, జగన్నాథం, మురళీ ప్రసాద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకి జనసేన నాయకుల వినతి

ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్‌కు వినతి పత్రం ఇస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కోట మండలం, గూడలి వద్ద ఉన్న స్వర్ణముఖి నదిపై వంతెన నిర్మించాలని, అలాగే పట్టణంలో జాతీయ రహదారికి అనుసంధానంగా పంబలేరు వంతెన పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయని వాటిపై దృష్టి సారించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు ఎంఎల్ఏ పాశం సునీల్ కుమార్‌ను కోరారు. రుద్రవరం గ్రామ విద్యార్థులు మెట్టు గ్రామంలోని పాఠశాలకు వెళ్లేందుకు దారి లేకపోవడంతో స్వర్ణముఖి నదిలోని ఏరు దాటి వెళ్తున్నారని తెలిపారు. ఏటిలో నీరు ఉన్నపుడు ప్రమాదకరంగా ఉంటోందని, కావున బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. చిట్టమూరు మండలం, మల్లాం గ్రామం జడ్పీ హైస్కూల్లో ఆట స్థలం లేకపోవడంతో విద్యార్థులు క్రీడల్లో వెనకబడిపోతున్నారని, ఆట స్థలాన్ని పాఠశాలకు కేటాయించాలని కోరారు. మల్లాం హస్పిటల్ అభివృద్ధి చేయాలని కోరారు. స్పందించిన ఎంఎల్ఏ సునీల్ కుమార్ అధికారులకు ప్రతిపాదనలు పంపి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు నియోజకవర్గం పీఓసీ కె.మోహన్, సాయి, సనత్ చిట్టమూరు నాయకులు రాజా, శంకర్, చిల్లకూరు నాయకులు కార్తీక్, రమేష్, మణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి ఆయల గోపురం బాధితులకు పరిహారం

చెక్కు అందిస్తున్న ఆలయ ఈవో

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : రాజగోపురం(గాలి గోపురం) బాధితులకు శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో బాపిరెడ్డి సోమవారం పరిహారం అందజేశారు. రాజగోపురం కూలిన ఘటనలో ఆర్ఎన్ మాల, వి.సుశీలమ్మలు తమ ఆస్తులను కోల్పోయారు. దాదాపు 13 ఏళ్ల అనంతరం దేవాదాయ శాఖ వారికి పరిహారం మంజూరు చేసింది. ఆ మొత్తాన్ని ఈవో చెక్కు రూపంలో బాధితులకు అందజేశారు.

సోమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -కోట : కోట శ్రీ కామాక్షి దేవి సమేత సోమేశ్వరస్వామి ఆలయంలో స్వామి అమ్మ వార్లకు వసంత పంచమి పురస్కరించుకొని కోట పట్టణానికి చెందిన కార్తికేయ మినరల్స్ అధినేత రాయపు సుబ్రహ్మణ్యం, అన్నపూర్ణ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, సోమేశ్వరస్వామికి వేద పండితులు నాగరాజు గురుకుల్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పించి వివిధరకాల పూలతో అలంకరించి భక్తుల దర్శన భాగ్యంకల్పించారు. అనంతరం రాయపు సుబ్రహ్మణ్యం అన్నపూర్ణ దంపతుల ద్వితీయ కుమారుడు రాయపు సోహిత్ మిత్రకు అక్షరాభ్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు, ఎన్ డి డి సి మాజీ ఉపాధ్యక్షుడు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి పాల్గొని అక్షింతలు వేసి సోహిత్ మిత్రాను ఆశీర్వదించారు.ఈకార్యక్రమంలో వేదపండితుల నాగరాజు గురుకుల్, రాయపు సుబ్రహ్మణ్యం సంపూర్ణ దంపతులు, వాటి భాస్కర్ రెడ్డి, రాజేష్, మోహన్, భక్తులు పాల్గొన్నారు.

ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో అన్నదానం

ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓం సాయిరాం చారిటీస్ వృద్ధాశ్రమం నందు తూపిలి నాగరాజ (నాగులు) వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్, ట్రెజరర్ కాటూరి శ్రీనివాసులు, ప్రగతి కుటుంబ సభ్యులు వాకటి రామ్మోహన్‌రావు, తూపిలి యశ్వంత్, కె ఆర్ ఎం, రిటైర్డ్ ఎస్ఏ ప్రభాకర్, వాచ్ షాప్ రాము, పోతిరెడ్డి పెంచలయ్య, డిష్ నాగరాజు, గోల్డ్ షాప్ మల్లికార్జున, సంచు ముని ప్రసాద్, కృష్ణారెడ్డి, నాగేంద్ర, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మృతికి ఎమ్మెల్యే నివాళి

నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : తెలుగుదేశం పార్టీ సమన్వయ కార్యదర్శి పండారం రామారెడ్డి ఆదివారం మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ అన్నారు. ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళి అర్పించారు. ఆయన వెంట జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగ రెడ్డి, నాయకులు సంతోష్, పండారం మణి, చొక్కాలింగారెడ్డి, మహేష్ నారాయణ, హరి, సురేష్, గోపాల్, మురుగేశ్ రెడ్డి, గణేష్, రామస్వామి రెడ్డి, చిరంజీవి, గణేష్, బొబ్బిలి రెడ్డి, ఉమాపతి, కైలాసం, ప్రకాష్ రాజ్ తదితరులు ఉన్నారు.

దుకాణాల తొలగింపుపై వీధి వ్యాపారుల నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా తమ దుకాణాలను ఎలా తొలగిస్తారంటూ పట్టణ వీధి వ్యాపారులు సోమవారం మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్ద సుమారు 50 మంది వీధి వ్యాపారులు ఎన్నో ఏళ్లుగా చిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని జీవనం గడుపుతున్నారు. అయితే ఇటీవల మున్సిపల్ అధికారులు వీరికి ప్రత్యామ్నాయఏర్పాట్లు చేస్తామని, దుకాణా లు ఖాళీ చేయాలని సూచించారు. మూడు నెలలు గడిచిపోతున్న ప్రత్యామ్నాయ ఏర్పా ట్లు చేయకపోవడంతో వీధి వ్యాపారులు నిరసన తెలుపుతూ వస్తున్నారు. ఈ క్రమంలో దుకాణాలను తొలగించేందుకు వచ్చిన మున్సిపల్ అధికారులను వీధి వ్యాపారులు అడ్డుకున్నారు.

తల చిత్రం ట్రైలర్ విడుదల

తన కుమారుడిని పరిచయం చేస్తున్న కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రముఖ కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ తనయుడు అమ్మ రాగినిరాజ్ నటించిన 'తల' చిత్రం ప్రమోషన్స్ ట్రైలర్‌ను సోమవారం తిరుపతి కరకంబాడి మార్గంలోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా కొరియోగ్రాఫర్ అమ్మ రాజశేఖర్ మాట్లాడుతూ తన కుమారుడు నటించిన తొలి సినిమా శ్రీవారి పాదాల చెంత నుండి ప్రమోషన్స్ విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. తొలి అడుగు చిత్రసీమలో తిరుపతి నుండి వేస్తున్నామని, ఫిబ్రవరి 14న ప్రేమికుల రోజు సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నామన్నారు. చిత్ర కథానాయకుడు అమ్మ రాగినిరాజ్ మాట్లాడుతూ అమ్మ మీద ప్రేమను చూపించే కొడుకు పాత్రలో నటించానని, కుటుంబ కథాంశంతో రూపొందించిన తన తొలి చిత్రం తలను ప్రేక్షకులు ఆదరించాలని కోరారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 220 అర్జీలు

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో క్షేత్రస్థాయిలో ప్రతి అర్జీకి పరిష్కారం చూపుతూ రీ ఓపెన్ లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన అర్జీదారుల నుండి కలెక్టర్ అర్జీలు స్వీకరిం రు. పిజిఆర్ఎస్‌కు 220 అర్జీలు రాగా అందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 116 వచ్చాయి. ఈ కార్యక్రమంలో జెసి శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, డిఆర్డిఏ పిడి శోభన్ బాబు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం నిర్మాణానికి భూమి పూజ

భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక కార్వేటినగరం రోడ్డు లోని రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో అన్నదాన సత్రం, కళ్యాణ మండపం నిర్మాణం కోసం సోమవారం నగరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ చేతుల మీదుగా భూమిపూజ,శంకుస్థాపన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చైర్మన్ రామిశెట్టి గిరిజ మనోహర్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు ఘన సన్మానం

అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రిపబ్లిక్‌డే ఉత్సవాల్లో అవార్డులు పొందిన ప్రభుత్వ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. సోమవారం పుత్తూరు కమిషనర్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పుత్తూరు కమిషనర్ మంజునాథ్ గౌడ్ హాజరై ఉత్తమ అవార్డు గ్రహీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మోహన్ బాబు, ట్రెజరర్ డి సుగుణ, జాయింట్ సెక్రెటరీ జి.గురుస్వామి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.తిరుమలయ్య, జాయింట్ సెక్రటరీ టి శ్రీనివాసులు బాబులు పాల్గొన్నారు.

చిరుతను బంధించడానికి బోన్ల ఏర్పాటు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): గత నాలుగు వారాలుగా శ్రీ వెంకటేశ్వర వర్సిటీ, వేదిక్ వర్సిటీ పరిధిలో కలవర పెడుతున్న చిరుత సంచారంతో అటవీశాఖ అధికారులు చిరుతను బంధించడానికి సోమవారం బోన్లను ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయాల పరిధిలో వృధాగా వేస్తున్న ఆహారం తినడానికి వచ్చే జింకలు, కుక్కలను చిరుత వేటాడి లాక్కెళుతున్న వీడియోలు వైరల్‌గా మారాయి. విద్యార్థులు వర్సిటీలో చిరుత సంచారంతో భయానక వాతావరణం ఏర్పడిందని ఎలాగైనా చిరుతను బంధించాలని అటవీశాఖ అధికారులకు, వర్సిటీ అధికారులు లేఖలు రాశారు. చిరుత సంచార ప్రదేశాలను పరిశీలించిన అటవీశాఖ అధికారులు బోన్లను ఏర్పాటు చేశారు.

కూటమి నేతల దాడులు హేయం

నిరసన తెలుపుతున్న వైసీపీ నాయకులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతిలో జరుగుతున్న అసాంఘిక చర్యలకు, దాడులకు, చంద్రబాబు ప్రభుత్వం బాధ్యత వహించాలని తిరుపతి జిల్లా, బుచ్చినాయుడు కండ్రిగ మండలం వడ్డెర సంఘం జిల్లా అధ్యక్షుడు డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో అప్రజాస్వామ్యక చర్యలు మితిమీరి పోతున్నాయన్నారు. ఇటు ప్రభుత్వం కానీ, అటు పోలీసు యంత్రాంగం కానీ శాంతి భద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం బాధాకరమన్నారు. తిరుపతిలో జరుగుతున్న డిప్యూటి మేయర్ ఎన్నికలలో ఓటు వేసేందుకు వెళుతున్న ఎంపి గురుమూర్తి, వైసిపి కార్పోరేటర్లు వెళుతున్న బస్సును అడ్డగించి, రాళ్ళతో దాడి చేయడం, బెదిరింపులకు దిగడం ఏమాత్రం సమంజసం కాదని ఆయన మండిపడ్డారు. కూటమి నేతల రౌడీ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తక్షణమే దాడి చేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు వెంకటేష్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానం నిషేధం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు తప్పవని వన్ టౌన్ సీఐ గోపి హెచ్చరించారు.భరద్వాజ తీర్థంలో ఉన్న గంగా సదన్ వసతి గృహాల సముదాయంలో సోమవారం వ్యర్థాలను తొలగించారు. మద్యం సేవించడం నిషేధం అనే హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి) : పూతలపట్టు నాయుడుపేట జాతీయ రహదారి చంద్రగిరి బైపాస్‌లోని హ్యాపీ డాబా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మృతిని వివరాలు తెలియలేదు. ఆ వ్యక్తి యాచకుడిగా పోలీసులు భావిస్తున్నారు. ఏఎస్ఐ సుధాకర్ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చంద్రగిరి పోలీసులు తెలిపారు.

ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు

విద్యానగర్ బాలభారతి స్కూల్ వద్ద హెచ్చరిక బోర్డు లేని డివైడర్‌ని ఢీ కొన్న కారు

ప్రజాశక్తి -కోట : ఆర్ అండ్ బి అధికారుల నిర్లక్ష్యంతో నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయి. సోమవారం రాత్రి 7 గంటల సమయంలో నెల్లూరు నుండి కోట పట్టణానికి వస్తున్న ఓ కారు విద్యానగర్ బాలభారతి స్కూల్ వద్ద హెచ్చరిక బోర్డు లేని డివైడర్‌ను ఢీ కొని మధ్యలోకి దూసుకుపోయింది. అయితే కారులో ప్రయాణిస్తున్న వారికీ ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరిపీల్చు కున్నారు. అనంతరం జేసీబీతో కారును బయటకు లాగారు. అదే ప్రాంతంలో పదే పదే ప్రమాదాలు జరుగుదున్నాయి. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

వెంకటగిరి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.30/2024

మల్లెల ప్రభాకర్ ....వాది
VS
గుత్తికొండ లలితబాబు ...ప్రతివాది

To.
గుత్తికొండ లలితబాబు, తండ్రి రామానాయుడు గుత్తికొండవారిపల్లి(జి.కె.పల్లి)గ్రామం, వెంకటగిరి మండలం, తిరుపతిజిల్లా.

ప్రకటన

పై కోర్టులో వాది ప్రొనోట్ బాకీ వసూలు నిమిత్తం నీపై దావా వేసివున్నారు. పై దావా మీ హాజరు నిమిత్తం తేది.13.03.2025న వాయిదా వేయబడి వున్నది.ఆ దినము మీరు ఉదయం గం॥10.30ని ॥ ల నుండి పై కోర్టులో హాజరు కావలెను. అట్లు తప్పిన యెడల దావా మీ పరోక్షములో తీర్మానం చేయబడును.

ఇట్లు
గున్నేరి హరనాథ్‌రెడ్డి
వాది అడ్వకేట్
వెంకటగిరి-9440726775

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE :: TIRUPATI
I.A.No.396 OF 2023
O.S.No.29 OF 2021

M.Nagaraja Naidu ...Petitioner/Plaintiff
Vs.
B.Maheswari & others ...Respondents/Defendants

NOTICE TO THE RESPONDENTS No.16 & 18

To **R16:**
K. Pavithra,W/o K.Venugopal, D.No.11-78, S.V.Nagar, M.R.Palli, Tirupati-2, Tirupati District.
R18: G. Haribabu, S/o G. Raja Reddy, D.No.19-3-1/65H, Kaikalacheruvu, Tirupati.

Please take notice that the above I.A. is posted to 18.02.2025 for your appearance and you have to appear before the said court on that day, either by yourself or through your advocate at about 10.30 a.m. or else you will be set exparte and the case will be proceeded in your absence.

Date of hearing: 18.02.2025

M.Vani,
P. Muralikrishna Reddy,
Advocates, Tirupati.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయడం ఏమనగా ఈ క్రింది షెడ్యూల్ దాఖల ఆస్తికి సంబంధించినటువంటి ముంగర శంకరయ్య సరుపురు వసంత లక్ష్మికి వ్రాసి ఇచ్చినటువంటి రిజిస్ట్రర్డ్ ఒరిజనల్ సవరణ పత్రం నెంబర్:3014/2015, dated 24.09.2025 అయిన డాక్యుమెంట్ పోయినది. సదరు సంబంధిత షెడ్యూల్ ఆస్తిని Tamiland Mercantile Bank Limited, Gudur Branch వారికి తుపిలి పద్మజ, W/o శ్రీనివాసులు, తూర్పు గూడూరు వారు తనఖా పెట్టి లోన్ తీసుకోవాలని అనుకుంటున్నారు. దీనివిషయమై ఎవరికైనా ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఈ ప్రకటన తేదీ నుండి వారం రోజుల లోపల నాకు కానీ, లేదా మేనేజర్ కి కానీ తెలుసుకోవసినది. వారం రోజుల కాలపరిమితి అయిన పిదప చేసినటువంటి ఆక్షేపణలు బ్యాంక్ కు బద్దగించవు.

షెడ్యూల్

Tirupathi District Registration - Gudur Revenue District Registration – Gudur Sub-Registration District – Gudur Mandal – Gudur Municipality Area – East Gudur Village – Survey No.577/4 – Ward No.5 – East Kapu Street Area – Door No.108 – Old Assessment No.2560 – New Assessment No.1029007677 – After demolished an extent of 16 Ankanams or 128 Sq.Yards of Vacant Site and eastern side 20 feet Running compound Wall with all esementary rights therein within the following boundaries :

East : Municipality Road
South : House & Site belongs to Athalavari Sudhakar Rao
West : House & Site belongs to K. Venugopalaiah some extent; and Municipality Road to some extent
North : House of Chillakur Lakshmi

Out of the said boundaries is an extent of 16 Ankanams or 128 Sq.Yards of Vacant Site and on the eastern side 20 feet Running compound Wall therein

ఇట్లు
డి. వెంకటేశ్వరరావు
అడ్వకేట్, గూడూరు.ఫోన్ నెం.9866072082